క్లుప్తంగా

అప్పన్నకు వైభవంగా నిత్యకల్యాణం



నిత్యకల్యాణంలో తలంబ్రాలు ఘట్టం నిర్వహిస్తున్న అర్చకులు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామికి బుధవారం నిత్యకల్యాణం వైభవంగా జరిగింది. ఆలయ కల్యాణమండపంలో వేదికపై స్వామివారి ఉత్సవమూర్తులు గోవిందరాజ స్వామి, శ్రీదేవి, భూదేవిలను అధిష్ఠింపజేశారు. ఉదయం 9.30 నుంచి కల్యాణాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, కంకణధారణ, యజ్ఞోపవీతం, జీలకర్రబెల్లం, మాంగళ్యధారణ, తలంబ్రాలు తదితర ఘట్టాలతో కల్యాణాన్ని జరిపారు. ఉభయదాతలకు స్వామివారి అక్షింతలు, ప్రసాదం, శేషవస్త్రాలను అందించారు.

ఉమెన్స్ డే వేడుకల పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న గిరిజన సంఘ ప్రతినిధులు

పెందుర్తి: పెందుర్తి ప్రాంత గిరిజన ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఈ నెల 8న మహిళా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించనున్నట్లు ఆ సంఘ ప్రతినిధులు లకే చిట్టిబాబు, ప్రధాన కార్యదర్శి దీసరి భాస్కరరావు తెలిపారు. స్థానిక సంఘ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో వేడుకల పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చినముషిడివాడలోని వీఆర్ ఫంక్షన్ హాల్‌లో ఆ రోజు మధ్యాహ్నం 3 గంటల నుంచి వేడుకలు ప్రారంభమవుతాయన్నారు. మహిళలకు పలు పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో స్థానిక నాయకుడు శానాపతి శంకర్రావు, సంఘం ప్రతినిధులు కొర్ర భైరాజమూర్తి, బాకురు కరుణాకర్, పాత్తురు మల్లేశ్, శెట్టి జయదాస్, సీకరి ఈశ్వరరావు, పూజారి భాస్కరరావు, పెందుర్తి గౌరీ సేవా సంఘం ప్రతినిధులు పాల్గొన్నారు.

ఆశల ఉప్పు సాగు



గట్ల పైనున్న ఉప్పును పాకల్లో నిల్వ చేయడానికి తరలిస్తున్న కూలీలు

ఉప్పులేని వంటకం రుచించదు. దాన్ని సాగు చేసే రైతుల బతుకుల్లో మాత్రం చప్పదనమే. ఉప్పు సత్యాగ్రహంలో బ్రిటిష్ వారినే గడగడలాడించిన ఉప్పు రైతుల గురించి చరిత్రలో గొప్పగా చదువుకున్నాం. తరతరాలుగా ఈ పంటనే నమ్ముకున్నవారి జీవితాలు మాత్రం కన్నీటి కడలిలో కరిగిపోతున్నాయి. ప్రతికూల వాతావరణ పరిస్థితులతో గత ఏడాది భారీగా నష్టపోయారు. ఈ ఏడాదైనా కాలం కలిసి వచ్చి, కష్టాలు తీరక పోతాయా అనే ఆశతో పరవాడలోని సుమారు 100 మంది రైతులు, 250 ఎకరాల్లో ఉప్పు సాగుకు సిద్ధమయ్యారు.

- పరవాడలో ఉప్పు సాగులో 100 మంది రైతులు
- ఈ ఏడాది 250 ఎకరాల్లో సాగుకు సన్నద్ధం
- గతేడాది నష్టాల నర్దుబాటుపై రైతుల ఆశలు

పరవాడ: మండలంలోని వాడచీపురుపల్లి శివారు దలాయిపాలెంలో ఉప్పుసాగు జరుగుతోంది. ఇక్కడి భూముల్ని సొంతంగా, కౌలుకు తీసుకుని వాడచీపురుపల్లి, నాయుడుపాలెం, దలాయిపాలెం, పోలిరెడ్డిపాలెం, గొరుసువానిపాలెం, పందివానిపాలెం గ్రామాలకు చెందిన వంద మంది రైతులు ఉప్పు సాగులో ఉన్నారు. ఏటా నవంబర్, డిసెంబర్ మాసాల్లో ఉప్పు మడులకు మరమ్మతులు చేసి పంటకు సిద్ధం చేస్తారు. జనవరి నుంచి మే వరకు ఎండలు మెండుగా ఉంటే ఉప్పు దిగుబడులు ఆశాజనకంగా ఉంటాయి. ఈ ఏడాది 250 ఎకరాల్లో ఉప్పు సాగు చేపట్టారు.

ఎకరాకు రూ.60 వేలు ఖర్చు

ఎకరం విస్తీర్ణంలో ఉప్పు పంట సాగుకు సుమారు రూ.50–60 వేలు వరకు ఖర్చవుతుందని రైతులు చెప్తున్నారు. వాతావరణం అనుకూలిస్తే ఇక్కడ ఉప్పు పంట సాగవుతున్న 250 ఎకరాల విస్తీర్ణంలో ఏటా సీజన్‌లో(జనవరి–మే) రెండు లక్షలకు పైగా(80 కిలోల) బస్తాల దిగుబడులు వస్తాయంటున్నారు. పరిస్థితులు బాగుంటే ఎకరాకు వెయ్యి బస్తాల ఉప్పు దిగుబడులు సాధించవచ్చు. ఇక్కడ పండించిన ఉప్పును ఒడిశా, విజయనగరం, శ్రీకాకుళం, విశాఖ, ఏజెన్సీ ప్రాంతాలకు చెందిన వ్యాపారులు వచ్చి కొనుగోలు చేసి, తరలించుకుపోతారు. కాలం అనుకూలిస్తే ఖర్చులు పోనూ రూ.లక్షకు పైగానే ఆదాయం వస్తుందని రైతులు చెప్తున్నారు.

గతేడాది అకాల వర్షాలకు నష్టం

గతేడాది అకాల వర్షాలతో ఉప్పు పంట సాగుకు తీవ్ర నష్టం ఏర్పడింది. దిగుబడి ఆశాజనకంగా లేకపోవడంతో 80 కిలోల ఉప్పు బస్తా రూ.280–300 వరకు అమ్మకాలు జరిపారు. ప్రస్తుతం కొత్తగా వచ్చిన ఉప్పు బస్తా రూ.230–240ల మధ్య ధర పలుకుతోంది. ప్రస్తుతం పరిస్థితులు కాస్త అనుకూలంగా ఉన్నప్పటికీ.. డిసెంబర్లో కురిసిన వర్షం రైతులకు నష్టాన్ని కలిగించింది. మడుల్ని సిద్ధం చేసుకున్న సమయంలో అకాల వర్షాలతో మడులు పాడయ్యాయి. మళ్లీ రైతులు తేరుకుని వడ్డీ వ్యాపారుల నుంచి అప్పులు తెచ్చి మరీ, జనవరిలో మడులకు మరమ్మతులు చేసి, ఉప్పు పంటకు సన్నద్ధమయ్యారు.

కూలీలు దొరక్క ఇబ్బందులు

ప్రస్తుతం ఎండలు మెండుగా ఉన్నాయి. ఇదే పరిస్థితి మే వరకు కొనసాగితే రైతుల కష్టాలు గట్టెక్కినట్లే. ఉప్పు పంట సాగుకు కూలీల కొరత వేధిస్తోంది. మహిళలకు రూ.530, మగ కూలీలకు రూ.650 చెల్లిస్తున్నా కూలీలు దొరకట్లేదు. ఉప్పు గల్లీల సమీపంలో ఉన్న పరిశ్రమలకు చెందిన బూడిద ఉప్పు పంటను తీవ్రంగా దెబ్బతీస్తోందని రైతులు గగ్గోలు పెడుతున్నారు. మార్కెట్‌లో విరివిగా లభిస్తున్న శుద్ధి చేసిన సాల్ట్ ప్యాకెట్లు కూడా కళ్లుప్పు డిమాండ్‌ను తగ్గిస్తున్నట్లు చెప్తున్నారు.



దలాయిపాలెంలోని ఉప్పు మడుల గట్టుపై పోగులు వేసిన ఉప్పు



మడుల్లోని ఉప్పును తీస్తున్న కూలీలు

అకాల వర్షాలతో నష్టం



నాకు సొంత గల్లీ లేదు. రెండెకరాలు కౌలుకు తీసుకున్నా. గతేడాది అప్పు చేసి పెట్టుబడులు పెట్టాను. పంట చేతికందుతుందన్న టైంలో వర్షాలు పడి రూ.2 లక్షలు నష్టపోయా. దేవుడిపై భారం వేసి మళ్లీ అదే భూమిని కౌలుకు తీసుకుని సాగుచేస్తున్నాను. – బూస రాంబాబు, గొరుసువానిపాలెం

కూలీల కొరత పీడిస్తోంది



నేను రెండెకరాలు కౌలుకు తీసుకుని ఉప్పు పంట సాగు చేస్తున్నాను. లకాల వర్షాలతో పాటు కూలీల కొరత వేధిస్తోంది. ఎన్టీపీసీ, భవన నిర్మాణ పనులపై ఆధారపడిన కూలీలు పొద్దస్తమాను ఎండలో చేయాల్సిన ఉప్పు మోత పనులపై ఆసక్తి చూపట్లేదు. – బురద రాజు, రైతు, పోలిరెడ్డిపాలెం

ముంచుతున్న ఎన్టీపీసీ బూడిద



ఎన్టీపీసీ బూడిద చెరువుల నుంచి ఎగసి పడుతున్న బూడిద, ఏషియన్ పెయింట్స్ పరిశ్రమ నుంచి వస్తున్న తెల్లని పౌడర్ ఉప్పు పంటను నాశనం చేస్తున్నాయి. ఈ బూడిద మడులపై పడడంతో ఉప్పునీరు డిగ్రీ తగ్గిపోతోంది. బూడిద నిర్మూలనకు చర్యలు తీసుకోవాలి. – బి.రామకృష్ణ, రైతు, గొరుసువానిపాలెం

కూలి గిట్టుబాటు కావట్లేదు



రోజంతా ఎండలో పని చేస్తున్నా యాజమాన్యాలు చెల్లించే కూలి రేట్లు గిట్టుబాటు కావట్లేదు. బయట పనులకు వెళితే ఎండ తగలకుండా ఎక్కువ కూలి డబ్బులు చేతికొస్తాయి. నిత్యం పనులు దొరికే పరిస్థితి లేకపోవడంతో ఉప్పు మోతలకు రావాల్సి వస్తోంది. – చీపురుపల్లి లక్ష్మి, కూలీ, వాడచీపురుపల్లి

నల్లక్వారీలో కార్డెన్ సెర్చ్



సీజ్ చేసిన వాహనాలతో సీఐ సతీష్‌కుమార్ పోలీసుల బృందం

- సరైన పత్రాల్లేని ఆరు బైక్‌లు, ఆటో సీజ్

పెందుర్తి: పెందుర్తి సమీపంలోని నల్లక్వారీ ప్రాంతంలో పోలీసులు బుధవారం కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. సర్కిల్ ఇన్‌స్పెక్టర్ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో ఐదు బృందాలు కాలనీలో విస్తృతంగా గాలించాయి. సరైన పత్రాలు లేని ఆరు బైక్‌లు, ఒక ఆటోను స్వాధీనం చేసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ సరైన పత్రాలు లేనివి, చోరీ చేసిన వాహనాలపై తిరిగినా, కొనుగోలు చేసినా ఇబ్బందులు తప్పవని హెచ్చరించారు. రానున్న రోజుల్లో మరిన్ని ప్రాంతాల్లో కార్డెన్ సెర్చ్‌లు నిర్వహిస్తామన్నారు. సబ్‌ఇన్‌స్పెక్టర్లు అసిరితాత, స్వామినాయుడు, సిబ్బంది పాల్గొన్నారు.

ఉత్సాహంగా పెయింటింగ్ పోటీలు



పెయింటింగ్ పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

పరవాడ: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని పరవాడ సీఐ ఆర్.మల్లికార్జునరావు ఆదేశాల మేరకు పి.బోనంగి సంస్కృతి గ్లోబల్ పాఠశాల విద్యార్థులకు బుధవారం పెయింటింగ్ పోటీలను నిర్వహించారు. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు మహిళా దినోత్సవాన బహుమతులను అందజేయనున్నట్లు ఎస్ఐ ప్రసాదరావు తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపాల్ ఎన్.సీతాలక్ష్మి, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

పేకాట శిబిరంపై దాడి

- నలుగురి అరెస్ట్, రూ.2 లక్షలు స్వాధీనం

పెందుర్తి: మండలంలోని జంగాలపాలెం సమీపంలో గుట్టుచప్పుడు కాకుండా నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పెందుర్తి పోలీసులు బుధవారం రాత్రి దాడి చేశారు. నలుగురు వ్యక్తులను అరెస్ట్ చేసి, వారి నుంచి రూ.2 లక్షలు నగదు స్వాధీనం చేసుకున్నారు. సీఐ కె.వి.సతీష్‌కుమార్ ఆధ్వర్యంలో కేసు దర్యాప్తు చేస్తున్నారు. పేకాట, జూదం తదితర సంఘ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడినవారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సారా రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యం

- ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీరామచంద్రమూర్తి



అవగాహన సదస్సులో ప్రసంగిస్తున్న ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ రామచంద్రమూర్తి

పరవాడ: ఆంధ్రప్రదేశ్‌ను సారా రహిత రాష్ట్రంగా మార్చడమే లక్ష్యంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ డి.శ్రీరామచంద్రమూర్తి సూచించారు. ముత్యాలమ్మపాలెం గ్రామ సచివాలయంలో సారా నిర్మూలనపై బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నవోదయం 2.0 సారా రహిత కార్యక్రమంలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. సారా తయారీ, విక్రయాలు చేపట్టిన వ్యక్తులు చట్ట ప్రకారం 8 ఏళ్ల కఠిన కారాగార శిక్ష అనుభవించాల్సి ఉంటుందని హెచ్చరించారు. తాగుడుకు బానిసలైన వారి పరివర్తన కోసం డి–అడిక్షన్ సెంటర్లను ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు. సారా తయారీదారులు, అమ్మకందారులు ఆ వృత్తిని వదిలి బయటకి వస్తే వారి జీవనోపాధికి ప్రభుత్వం సాయం చేస్తుందన్నారు. సదస్సులో సబ్బవరం ఎక్సైజ్ సీఐ డి.అనిల్‌కుమార్, ఎస్ఐ వి.వి.రమణ, పరవాడ ఎస్ఐ ప్రసాదరావు, సర్పంచ్ సీహెచ్ సుజాత ముత్యాలు పాల్గొన్నారు.

ఘనంగా శివాలయ వార్షికోత్సవం



పూజలందుకున్న చోడేశ్వరస్వామి



కల్యాణంలో పాల్గొన్న భక్తులు

పెందుర్తి: పినగాడి చోడేశ్వరస్వామి దేవాలయం 17వ వార్షికోత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. ఉదయం స్వామివారికి విశేష అభిషేకాలు జరిపారు. అనంతరం ప్రత్యేకాలంకరణలో చోడేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ప్రత్యేక పూజలు జరిపారు. కల్యాణం వైభవంగా నిర్వహించారు. మధ్యాహ్నం జరిగిన అన్నసమారాధనలో దాదాపు 5 వేల మంది భక్తులు పాల్గొని అన్నప్రసాదాలు స్వీకరించారు. కోలాటాలతో కళాకారులు ఆకట్టుకున్నారు. సాయంత్రం ఉత్సవ మూర్తుల ఊరేగింపు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఆలయ కమిటీ ప్రతినిధులు బయిలపూడి హరగోపాల్, ఉమామహేశ్వరరావు, వందలాదిగా భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

జేఎన్ ఫార్మాసిటీలో భద్రతా వారోత్సవాలు



ప్రతిజ్ఞ చేస్తున్న ఎస్ఎన్ఎఫ్ ఇండియా పరిశ్రమ ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు

పరవాడ: జేఎన్ ఫార్మాసిటీలోని ఎస్ఎన్ఎఫ్ ఇండియా పరిశ్రమలో 54వ జాతీయ భద్రత వారోత్సవాలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వారోత్సవాల్లో భాగంగా పరిశ్రమ ఆవరణలో భద్రత జెండాను పరిశ్రమ మేనేజింగ్ డైరెక్టర్ కె.రాజేంద్రన్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో పాల్గొన్న పరిశ్రమల శాఖ అధికారులు, యాజమాన్య ప్రతినిధులు, ఉద్యోగులు, కాంట్రాక్టు కార్మికులు భద్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఈ సందర్భంగా పరిశ్రమ ఎండీ రాజేంద్రన్ మాట్లాడుతూ జాతీయ భద్రత వారోత్సవాలను ఈ నెల 10 వరకు నిర్వహించనున్నట్లు తెలిపారు. పరిశ్రమలో పనిచేస్తున్న ఉద్యోగులు, కార్మికులకు భద్రత ప్రాముఖ్యతను వివరించారు. కార్యక్రమంలో భాగంగా పరిశ్రమలో భద్రత పరికరాలను ప్రదర్శించారు. అనంతరం ఉద్యోగులకు భద్రత ప్రసంగ పోటీలను నిర్వహించారు. వారోత్సవాల్లో పరిశ్రమ ఉద్యోగులు, కార్మికులు పాల్గొన్నారు.

గాలికుంటు వ్యాధి నివారణకు టీకాలు



టీకాల కార్యక్రమాన్ని పరిశీలిస్తున్న జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ రామ్మోహనరావు

సబ్బవరం: మండలంలోని అమ్ములపాలెం, అసకపల్లి గ్రామాల్లో పాడి పశువులకు బుధవారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు ఆరిపాక పశు వైద్య కేంద్రం వైద్యులు డాక్టర్ స్వర్ణలత తెలిపారు. ఆయా గ్రామాల్లోని సుమారు 75 పాడి పశువులకు ఈ టీకాలు వేసినట్లు పేర్కొన్నారు. గాలికుంటు వ్యాధి టీకాల కార్యక్రమాన్ని జిల్లా పశు సంవర్ధకశాఖ అధికారి డాక్టర్ బి.రామ్మోహన్‌రావు సందర్శించారు. పాడి రైతులంతా ఈ శిబిరాన్ని సద్వినియోగం చేసుకునేలా చూడాలని సిబ్బందికి సూచించారు. ఈ నెల 30 వరకూ ఈ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో పశు సంవర్ధక సహాయకులు కె.లక్ష్మణరావు, యు.శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

బాలికలను వేధిస్తే 'పోక్సో'తో కఠిన చర్యలు



ర్యాలీలో పాల్గొన్న మహిళలు, ఐసీడీఎస్ అధికారులు, పోలీసులు, బాలికలు



మాట్లాడుతున్న జస్టిస్ వెంకటశేషమ్మ

- పిల్లలకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులే మార్గనిర్దేశకులు
- జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి వెంకటశేషమ్మ

పెందుర్తి: 18 ఏళ్ల లోపు బాలికలను శారీరకంగా, మానసికంగా వేధింపులకు గురిచేస్తే పోక్సో చట్టం ప్రకారం కఠిన శిక్షలు అమలు చేయనున్నట్లు జిల్లా సివిల్ కోర్టు జడ్జి, డీఎల్ఎస్ఏ కార్యదర్శి వెంకటశేషమ్మ తెలిపారు. స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పోక్సో చట్టంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సమాజంలో మంచి నడవడికతో మెలిగేలా తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పిల్లలకు మార్గనిర్దేశం చేయాలన్నారు. పలు చట్టాలపై మహిళలకు, బాలికలకు అవగాహన కలిగించారు. అనంతరం అవగాహన ర్యాలీ చేపట్టారు. సీడీపీవో నీలవేణి, సమగ్ర శిక్ష జీసీడీవో ఖలేషాబేగం, సీడబ్ల్యూసీ సభ్యురాలు కె.వి.లక్ష్మి, ఎస్ఐ కె.దేముడునాయుడు, వైద్యాధికారి డాక్టర్ దీపిక, హెచ్ఎం ఎం.కిరణ్మయి, ఉపాధ్యాయులు జగదీష్, శ్రీనివాస్, మాధురి, కిరణ్‌కుమార్, అంగన్‌వాడీ, వైద్యారోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

టెన్త్ విద్యార్థులకు స్టేషనరీ అందజేత



పంపిణీ చేసిన స్టేషనరీతో విద్యార్థులు

పరవాడ: తానాం గ్రామానికి చెందిన జనసేన పార్టీ నాయకుడు వత్రి పరదేశినాయుడు జన్మదినం సందర్భంగా స్థానిక జెడ్పీ హైస్కూల్ టెన్త్ విద్యార్థులకు స్టేషనరీని సమకూర్చారు. పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 35 మంది విద్యార్థులకు పుస్తకాలు, అట్టలు, పెన్నులను బుధవారం అందించారు. టెన్త్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణత సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో పాఠశాల హెచ్ఎం శ్రీదేవి, పార్టీ నాయకులు డి.రాజశేఖర్, రొంగలి శ్రీను, జి.సురేష్, పైల కుమార్, షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

సేంద్రియ సాగుతో మేలైన దిగుబడులు



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న వ్యవసాయ శాఖ ఏడీఏ రామారావు

పరవాడ: రసాయనిక ఎరువులు, పురుగు మందులు వాడకుండా సేంద్రియ పద్ధతిలో వ్యవసాయ పంటలు సాగు చేసేందుకు రైతులు ముందుకు రావాలని అనకాపల్లి వ్యవసాయశాఖ ఏడీఏ ఎం.రామారావు సూచించారు. రావాడ శివారు ధర్మారాయుడుపేట గ్రామంలో ప్రకృతి వ్యవసాయంపై బుధవారం ఏర్పాటు చేసిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రకృతి వ్యవసాయానికి రావాడ గ్రామాన్ని ఎంపిక చేసినట్లు పేర్కొన్నారు. సేంద్రియ పద్ధతిలో పంటల సాగు ద్వారా నాణ్యమైన దిగుబడులు సాధించవచ్చన్నారు. అనంతరం ప్రకృతి వ్యవసాయంలో ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన ఇన్‌పుట్స్, విత్తనాలు, కిట్లు, కషాయం తయారీపై రైతులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో రావాడ సర్పంచ్ మోటూరి సన్యాసినాయుడు, మండల వ్యవసాయాధికారి సీహెచ్ చంద్రావతి, వెలుగు ఏపీఎం రంగారావు, గ్రామ సచివాలయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.